క్లుప్తంగా

పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు



నందిగామ: పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణ పరిధిలోని 19వ వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను సోమవారం ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని 20 వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్యం విషయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటింటికీ వైద్యసేవలు



అన్నవరం(జగ్గయ్యపేట): సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భూచవరం వైద్యాధికారి స్రవంతి సూచించారు. మండలంలోని అన్నవరం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ప్రజల ఇంటింటికీ వెళ్లి ఆమె వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. పారిశుద్ధ్యం మెరుగునకు పంచాయతీ సిబ్బంది కూడా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల, అంగన వాడీ కేంద్రాలలోని విద్యార్థులకు ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకట్రావ్, ఏఎన్ఎం త్రివేణి, 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



వత్సవాయి : ప్రాథమిక సహకార పరపతి సంఘంలో సభ్యుడు కట్టా వెంకటేశ్వర్లు ఇటీవల మృతిచెందగా, ఆయన కుటుంబానికి సొసైటీ తరఫున రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తయ్య వెంకటేశ్వర్లు మృతుని కుటుంబసభ్యులకు సోమవారం రూ. 10వేలను అందజేశారు. ఈసందర్భంగా ముత్తయ్య మాట్లాడుతూ గతంలో ఇటువంటి ఆర్థిక సాయం లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక సొసైటీలోని సభ్యులు ఎవరైనా మృతిచెందితే, ఆర్థికసాయం అందించేలా నిబంధనలు తెచ్చారని తెలిపారు. ఆయన వెంట సొసైటీ కార్యదర్శి సామినేని హరికృష్ణ ఉన్నారు.

బ్యాంకు సేవలపై కళాజాత



వత్సవాయి : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా ఖాతాదారులకు అందిస్తున్న సేవలపై వత్సవాయిలో సోమవారం కళాజాత నిర్వహించారు.కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారులు తమ ఆటపాటల ద్వారా సహకార కేంద్ర బ్యాంకు ఖాతాదారులకు అందిస్తున్న రుణ, బీమా సదుపాయాలు, ఏటీఎం, క్రెడిట్ కార్డుల వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముత్తయ్య, సూపర్‌వైజర్ టి.శేషగిరిరావు, కార్యదర్శి సామినేని హరికృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



జగ్గయ్యపేట అర్బన్: పేట పట్టణంలో అవసరమైన చోట్ల రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపడతామని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తెలిపారు. స్థానిక 26వ వార్డులోని చెరుకూరి బజారులో రూ.10.35లక్షలతో రోడ్డుకు ఇరువైపులా చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఉదయభాను సహకారంతో ఇప్పటికే మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం విస్తృతంగా చేపట్టినట్లు వివరించారు. వార్డు కౌన్సిలర్ పాకలపాటి సుందరమ్మ డేవిడ్, నాయకులు బాబు, రామారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంపై కుదిరిన గురి

- ఫలిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలు ..
- అందుబాటులో అన్నిరకాల మందులు
- కొణకంచి ఆయుర్వేద వైద్యశాలలో పెరిగిన ఓపీ సంఖ్య



నూతన హంగులతో కొణకంచి ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి

కొణకంచి(పెనుగంచిప్రోలు): భారతీయ ప్రాచీన వైద్య విధానమైన ఆయుర్వేదంపై గ్రామీణ ప్రాంత ప్రజల్లో రోజురోజుకు ఆసక్తి పెరుగుతోంది. అన్నిరకాల జబ్బులకు పరీక్షలు చేస్తూ మందులు పంపిణీ చేస్తుండటంతోపాటు ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులకు కూడా ఉపశమనం లభిస్తుండటంతో ఆయుర్వేద వైద్యంపై ప్రజల్లో అవగాహన పెరిగింది. దీంతో ఆయుర్వేద వైద్యశాలకు వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. అందుకు పెనుగంచిప్రోలు మండలంలోని కొణకంచిలోని ఆయుర్వేద వైద్యశాలకు వచ్చే రోగుల సంఖ్యే నిదర్శనం. గతంలో ఈ వైద్యశాలలో రోజుకు ఐదు నుంచి పదిమంది రోగులు మాత్రమే ఈ వైద్యశాలకు వస్తుండగా, ప్రస్తుతం ఓపీ సంఖ్య 50 నుంచి 60కి పెరిగింది.

ఆయుర్వేద వైద్యశాలలకు మహర్దశ..

జాతీయ ఆయుష్ మిషన్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణలో ఆయుష్ వైద్యశాలలను ఆధునిక వసతులతో తీర్చిదిద్దుతున్నారు. కొణకంచిలో 1958లో నిర్మించిన ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి భవనాన్ని సుమారుగా రూ.5.10 లక్షలతో అందంగా తీర్చిదిద్దారు. శ్లాబుకు మరమ్మతులు, సీలింగ్ ఏర్పాటు, కాంపౌండ్‌వాల్‌కి రంగులు వేయడం, మంచినీటి వసతితోపాటు అవసరమైన మౌలికవసతులను కల్పించారు. దీంతో గతంతో పోలిస్తే ఆసుపత్రి పరిసరాలు పూర్తిగా మారిపోయి కార్పొరేట్ హంగులు సమకూరడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. అదేవిధంగా అనిగండ్లపాడు ఆయుర్వేద వైద్యశాలకు కూడా మరమ్మతుల నిమిత్తం నిధులు మంజూరయ్యాయి.

అన్ని వ్యాధులకు వైద్యం..

ఈ ఆయుర్వేద ఆసుపత్రిలో సాధారణ వ్యాధులతో పాటు కీళ్ల వాతం, పక్షవాతం, కంపవాతం, నోటివాతం, గ్యాస్ నొప్పులు, ఉబ్బసం, అల్సర్, మొలలు, కిడ్నీలో రాళ్లు, కంతులు, సొరయాసిస్, పులిపిరి వంటి జబ్బులతోపాటు బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యసేవలందిస్తున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. ఆయుర్వేద మందులు, క్షారసూత్ర, చిన్నపాటి పంచకర్మ థెరపీల ద్వారా నయం చేస్తున్నారు. కొణకంచి ఆయుర్వేద ఆసుపత్రికి పెనుగంచిప్రోలు మండలం నుంచే కాకుండా ఇతర మండలాల నుంచి కూడా రోగులు వస్తున్నారు. ఆసుపత్రిలో ఇద్దరు యోగా శిక్షకులు కూడా అందుబాటులో ఉంటూ ప్రజలకు యోగాపై శిక్షణ ఇస్తున్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వాణి

అందుబాటులోకి మరిన్ని మందులు...



ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆసుపత్రులకు నూతన హంగులు సమకూరాయి. మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. మరో 15 రోజుల్లో క్యాప్సిల్స్, సిరప్, ఆయిట్‌మెంట్, తైలాల రూపంలో మరిన్ని మందులు అందుబాటులోకి రానున్నాయి. త్వరలో పూర్తిస్థాయిలో పంచకర్మ థెరపీ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నాం. ఇక్కడ వైద్యం తీసుకున్న తర్వాత ఎంతోమంది తమ దీర్ఘకాలిక వ్యాధులు తగ్గాయని చెప్పడం సంతోషంగా ఉంది.

– కె.వాణి, వైద్యాధికారి, ఆయుర్వేద ప్రభుత్వాసుపత్రి, కొణకంచి

జబ్బులను నయం చేస్తున్నారు..



ఆయుర్వేద ఆసుపత్రి ద్వారా ఎన్నో వైద్య సేవలు అందుతున్నాయి. గతంతో పోలిస్తే ప్రజలకు అన్ని రకాల మందులు అందుబాటులోకి వచ్చాయి. నోట్లో పుండ్లు, కీళ్ల నొప్పులు, నెమ్ముతో బాధపడుతూ ఎన్నో ఆస్పత్రుల చుట్టూ తిరిగాను. వేలాది రూపాయలు ఖర్చుచేయాల్సి వచ్చింది. అయినా తగ్గని వ్యాధులను ఇక్కడ ఆయుర్వేద మందుల ద్వారా నయం చేస్తుండటం ఎంతో సంతోషంగా ఉంది.

– బి.సత్యనారాయణ, కొణకంచి

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ దేవమణిశ్రీనివాస్, సర్పంచి సీతమ్మ

వత్సవాయి : జిల్లా పరిషత్ నిధులు రూ.15 లక్షలతో వత్సవాయిలోని తూర్పుబజార్, ఎస్టీ కాలనీ ఏరియాలో నిర్మించ తలపెట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు జెడ్పీటీసీ యేశపోగు దేవమణిశ్రీనివాస్, సర్పంచ్ భూక్యా సీతమ్మ సోమవారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సహకారంతో మంజూరైన ఈ నిధులతో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి, రోడ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదెల రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు గుత్తా శంకరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొలికిపోగు వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ చింతల ఏడుకొండలు, భూక్యా రాజానాయక్, కొలుసు తిరుపతిరావు, పంచాయతీ ఈవో షేక్ ఇమామ్‌సాహెబ్ పాల్గొన్నారు.

ప్రమాద ప్రాంతాల్లో హెచ్చరికల బోర్డులు



హైవేపై ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన బోర్డుల వద్ద ఇన్‌స్పెక్టర్ హనీష్ , ఎస్‌ఐ పండుదొర

నందిగామ: ప్రమాదాల నివారణే లక్ష్యంగా అవసరమైనచోట్ల ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు పట్టణ పోలీస్‌స్టేషన్ ఇన్స్పెక్టర్ హనీష్ తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై తరచుగా జరుగుతున్న ప్రమాద ప్రాంతాలను గుర్తించారు. ఆయా ప్రాంతాలలో జాతీయ రహదారిపై సోమవారం స్టాప్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన ఇన్స్పెక్టర్ హనీష్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై పలుచోట్ల ఇటీవల నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆయా ప్రాంతాలలో ప్రమాదాలు నివారించేందుకు ముందు జాగ్రత్త చర్యగా స్టాప్‌బోర్డ్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహన చోదకులు కూడా తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దని సూచించారు. ఆయన వెంట ఎస్సై పండు దొర, ఏఎస్‌ఐ నాగేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

పరిహారం చెల్లించాలంటూ ఆందోళన



న్యూకాన్ కంపెనీ వద్ద గేటు వద్ద ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్తులు

పరిటాల(కంచికచర్ల) : స్థానిక న్యూకాన్ కంపెనీలో తొమ్మిది నెలల కిందట జరిగిన ప్రమాదంలో మృతి చెందిన పాలంకి హరికృష్ణ అనే కార్మికుడి కుటుంబానికి సదరు కంపెనీ ఇప్పటివరకు పరిహారం చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్తులు సోమవారం ఆకంపెనీ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మృతుడి భార్య మాట్లాడుతూ నా భర్తను అన్యాయంగా కంపెనీ యాజమాన్యం పొట్టన పెట్టుకుందని బోరున విలపించింది. నెలరోజుల్లోగా తమ కుటుంబానికి పరిహారం, బీమా నగదు చెల్లిస్తామని చెప్పి తొమ్మిదినెలలైనా ఇవ్వలేదని వాపోయింది. నష్టపరిహారం చెల్లించకుండా తనకు, తన ముగ్గురు ఆడపిల్లలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేసింది. వెంటనే పరిహారం చెల్లించాలంటూ బాధిత కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు నినాదాలు చేశారు. కంపెనీలో పనిచేసే సిబ్బందిని పనిచేయనీయకుండా అడ్డుకున్నారు. అనంతరం కొద్దిసేపటికి గ్రామానికి చెందిన పెద్దలు కంపెనీ వద్దకు చేరుకుని యాజమాన్యంతో చర్చలు జరిపారు. బాధితుడు హరికృష్ణ కుటుంబానికి త్వరలోనే పరిహారం చెల్లిస్తామని కంపెనీ యాజమాన్యం హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

ఆర్టీసీ కార్గో సేవలపై విస్తృత ప్రచారం



కార్గో సేవలపై కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఎం సుబ్రహ్మణ్యం, ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీలో ప్రజలకు అందుబాటులో ఉన్న కార్గో పార్సిల్ సర్వీస్ సేవలపై ఉద్యోగులు విస్తృత ప్రచారం చేయాలని డిపోమేనేజర్ సుబ్రహ్మణ్యం సూచించారు. ఆర్టీసీ డిపోలో కార్గో డెలివరీ మాసోత్సవాలపై ఉద్యోగులకు సోమవారం అవగాహన కల్పించి కరపత్రాలు ఆవిష్కరించారు. నాణ్యమైన అతితక్కువ ధరలో అందుబాటులో ఉన్న కార్గో సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందుకు ఉద్యోగుల సహకారం అవసరమన్నారు. స్థానిక రింగ్ సెంటర్‌లో ప్రజలకు ఆర్టీసీ డోర్‌డెలివరీపై కరపత్రాలు పంపిణీ చేశారు.

ఆర్టీసీ పార్శిల్ సర్వీసును ఆదరించాలి

నూజివీడు: ఆర్టీసీ ఆధ్వర్యంలో డోర్ డెలివరీ పార్శిల్ సర్వీసు, కొరియర్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చినందున వాటిని ప్రజలు ఆదరించాలని ఆర్టీసీ ఏలూరు ఏటీఎం కమర్షియల్ జీ లక్ష్మీ ప్రసన్న వెంకటసుబ్బారావు అన్నారు. ఆర్టీసీ డోర్ డెలివరీ పార్శిల్ సర్వీసు మాసోత్సవాలలో భాగంగా పట్టణంలో సోమవారం ఆర్టీసీ అధికారులు, సిబ్బంది కలిసి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోర్ డెలివరీని 50 కిలోల వరకు పార్శిల్‌లను పది కిలోమీటర్ల దూరం వరకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో 84 కౌంటర్లు ఉన్నాయని, త్వరలోనే బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో కూడా డోర్‌డెలివరీ చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ చేకూరి సూర్యపవన్‌కుమార్ పాల్గొన్నారు.

స్పందనలో ఏడు అర్జీలు

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఏడు అర్జీలు అందాయని ఆర్డీవో సాయిబాబు తెలిపారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించి నాలుగు అర్జీలు, పోలీస్, విద్యుత్, మున్సిపల్ శాఖలకు సంబంధించి ఒక్కొక్క అర్జీ చొప్పున మొత్తం ఏడు అర్జీలు అందినట్లు ఆర్డీవో వివరించారు.

రైతుభరోసాతో 25,255 మందికి లబ్ధి

జగ్గయ్యపేట: ఈ వ్యవసాయ సీజన్‌లో భాగంగా మంగళవారం విడుదల కానున్న రెండో విడత రైతు భరోసా, పీఎం కిసాన్ ద్వారా జగ్గయ్యపేట సబ్ డివిజన్ పరిధిలోని 25,255 మంది రైతులకు లబ్ధి చేకూరనున్నట్లు వ్యవసాయశాఖ ఏడీఏ భవాని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలకు చెందిన రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.10.10కోట్ల మేర నిధులు జమకానున్నాయని వివరించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

పెనుగంచిప్రోలు : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ మార్కపూడి గాంధీ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో కె.సిద్దారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీసభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

కరాటేలో చాంపియన్లుగా తిరువూరు బాలలు

తిరువూరు: తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంలో సినీ హీరో సుమన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తిరువూరు బాలబాలికలు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. కుమిటి జూనియర్స్ విభాగంలో తిరువూరు హర్షా ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు చాంపియన్స్‌గా నిలిచినట్లు కోచ్ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. విజేతలుగా నిలిచిన బాలబాలికలను తిరువూరు జూనియర్ సివిల్ జడ్జి ఎం.మోతీలాల్ సోమవారం అభినందించారు.



సినీనటుడు సుమన్‌తో కరాటే విజేతలు

చెరువు అభివృద్ధి పనుల పరిశీలన



చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఆర్కిటెక్టర్ రమేష్, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఊర చెరువు అభివృద్ధి పనులను సోమవారం ప్రముఖ ఆర్కిటెక్చర్ రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా పర్యాటక కేంద్రంగా రూపొందుతున్న చెరువు చుట్టూత వాకింగ్ ట్రాక్, పార్కు ఏర్పాటు తదితర పనులపై మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఎన్ని అవాంతరాలు ఎదురైనా వాటిని అధిగమించి చెరువును ఒక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు కొలగాని రాము, నాయకులు తన్నీరు నాగేంద్ర, కాశి కిషోర్, పుల్లారావు, దువ్వల రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికి సీఎం జగన్ కృషి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

వీరులపాడు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో పనిచేస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని బోడవాడ, పొన్నవరం, తాటిగుమ్మి గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తనదృష్టికి వచ్చిన సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో సోమవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలికవసతులు కల్పిస్తున్నామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కో సచివాలయానికి రూ. 20లక్షలు మంజూరు చేయడంతో ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామన్నారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిని కూడా గుర్తించి, వారికి త్వరితగతిన ఆయా పథకాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సాంకేతిక కారణాలతో తలెత్తిన ఇబ్బందులను సత్వరమే పరిష్కరించాలన్నారు. సచివాలయాలకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో చేపట్టాల్సిన పనుల అంచనాలను తయారు చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు.

మురుగునీటి తరలింపునకు ప్రత్యేక చర్యలు..

పొన్నవరంలో మురుగునీరు పారుదల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు హామీ ఇచ్చారు. మండలంలోని పొన్నవరం గ్రామ శివారులోని డ్రైనేజీని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ మురుగునీటి పారుదలకు అవసరమైన చర్యలు చేపట్టడంతోపాటు సమస్య శాశ్వత పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షహనాజ్ బేగం, సర్పంచ్‌లు షోడగిరి రాజశ్రీ, శీలం సంధ్య, పలకా మోహన్‌రెడ్డి, ఎంపీడీవో అరుంధతీ దేవి, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంకల్పయాత్ర చారిత్రాత్మకం



కోదాడ రోడ్డులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి, కేక్ కట్ చేస్తున్న నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో ఆరేళ్ల కిందట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర చారిత్రాత్మకమని, రాష్ట్ర చరిత్రను తిరగరాస్తూ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్‌కు నాంది పలికిందని జగ్గయ్యపేట వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. జగనన్న ప్రజాసంకల్ప యాత్ర చేపట్టి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఆదేశాల మేరకు కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మార్కెట్ యార్డు చైర్మన్ మానేపల్లి బ్రహ్మంతోపాటు నాయకులంతా కలసి పట్టణంలోని కోదాడ రోడ్‌లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసంకల్పయాత్రలో గుర్తించిన ప్రజల ఇబ్బందులు, సమస్యల ఆధారంగా రూపొందించిన మేనిఫెస్టోను అమలుచేయడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజకపాలన అందిస్తున్నారని కొనియాడారు. 341రోజులపాటు 3648 కిలోమీటర్ల మేర సాగిన ప్రజాసంకల్పయాత్ర ఓ చారిత్రకఘట్టంగా అభివర్ణించారు. ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను కూడా కలిపి 99.5 శాతం మేనిఫెస్టోను అమలుచేసిన ఘనత దేశచరిత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల సచివాలయాల కన్వీనర్లు తుమ్మేపల్లి నరేంద్ర, షాబుద్దీన్, పార్టీ జిల్లా కార్యదర్శి చెరుకుమల్లి రాంబాబు, పట్టణ, మండల యూత్ అధ్యక్షులు ఆవాల భవానీప్రసాద్, బజారు సాయి, దుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి, కౌన్సిలర్లు పందుల రోశయ్య, కాశి కిషోర్, తన్నీరు నాగేంద్ర, పూసల పుల్లారావు, కాటగాని నరసింహారావు, చారుగుండ్ల కొండ, ఎక్సైజ్ బాషా, మారిశెట్టి కోటేశ్వరరావు, కాసర్ల బాలస్వామి, గింజుపల్లి కృష్ణ, చిరంజీవి, దేవసహాయం, గోపి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల తీరుపై డీవైఈవో ఆగ్రహం



మాట్లాడుతున్న డీవైఈవో వెంకటప్పయ్య

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో సోమవారం ఒక్కరోజే ఐదుగురు ఉపాధ్యాయులు సెలవుపెట్టడంపై డీవైఈవో ఎం.వెంకటప్పయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా సోమవారం ఆయన ఈ పాఠశాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరుపై ఆరా తీశారు. ఐదుగురు ఉపాధ్యాయులు సెలవు పెట్టిన విషయాన్ని గుర్తించి, ఈ విషయంపై హెచ్‌ఎం వాణిని వివరణ కోరారు. ఉపాధ్యాయులు సెలవులు అడుగుతున్నారని, అందరూ ఒకేసారి సెలవులు పెట్టకూడదని చెప్పినా వినిపించుకోకుండా రికమెండేషన్లు చేయిస్తున్నారని హెచ్‌ఎం వివరణ ఇచ్చారు. అనంతరం డీవైఈవో ఈ విషయంపై పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ జయకృష్ణతో మాట్లాడారు. సెలవుల కోసం ఉపాధ్యాయులు రికమెండేషన్లు చేయిస్తున్న విషయం గురించి వాకబు చేశారు. ఇలా ఒకేసారి ఉపాధ్యాయులు ఎక్కువ మంది ఒకేసారి సెలవులు పెడితే విద్యార్థులు చదువులో వెనుకబడిపోతారన్నారు. ఈ పరిస్థితి మారాలని హెచ్చరించారు.

హెచ్‌ఎంలతో ప్రత్యేక సమావేశం...

అనంతరం డీవైఈవో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఆరు పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అత్యవసరం అయితేనే ఉపాధ్యాయులు సెలవులు తీసుకునేలా చూడాలన్నారు. సెలవుల విషయంపై సక్రమంగా మానిటరింగ్ చేయాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో అదనంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించి, నిబంధనలు సరిగా పాటించని వైనంపై సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను నిలదీశారు. భవనాన్ని లోతట్టు ప్రాంతంలో ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. మీ ఇంటి నిర్మాణం ఇలా జరుగుతుంటే, చూస్తూ ఊరుకుంటారా అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా తమ విధులు నిర్వర్తించాలని సూచించారు. సీసీ హరిరామ నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జొన్నలగడ్డ చెక్‌పోస్టు ఆకస్మిక తనిఖీ



చెక్‌పోస్టు వద్ద పోలీసులకు సూచనలిస్తున్న డీసీపీ అనిత

నందిగామ: సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి విజయవాడ రూరల్ డీసీపీ అజిత సూచించారు. తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో నందిగామ మండలం జొన్నలగడ్డ వద్ద గల రాష్ట్ర రహదారి చెక్‌పోస్టును సోమవారం సాయంత్రం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్ట్ ప్రాంతాన్ని పరిశీలించడంతోపాటు అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని రాఘవాపురం సమీపంలోని బాణాసంచా స్టాక్ పాయింట్‌ను డీసీపీ తనిఖీ చేశారు. అనుమతిపత్రాలను పరిశీలించి, స్టాక్ పాయింట్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. డీసీపీ వెంట నందిగామ పట్టణ ఇన్స్పెక్టర్ హనీష్, సిబ్బంది ఉన్నారు.